ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 నంద్యాల జిల్లా వార్తలు
శనివారం 30 మార్చి 2024





రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శనివారం 6:25(సాయంత్రం)
సెహరీ : ఆదివారం 4:52 (ఉదయం)






టీడీపీ జెండా ఎగురవేసిన చంద్రబాబు



రవ్వలకొండను మింగిన అనకొండ

- బనగానపల్లెకు పట్టిన శని రామిరెడ్డి
- అధికారంలోకి వస్తే నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతా
- నాపరాయి పరిశ్రమను ఆదుకుంటాం
- ప్రజాగళం సభలో టీడీపీ అధినేత చంద్రబాబు


మిద్దెలపైకి ఎక్కిన అభిమానులు

బనగానపల్లె, మార్చి 29: ఎమ్మెల్యే రామిరెడ్డి రవ్వలకొండను మింగిన అనకొండ అని, బనగానపల్లెకు పట్టిన శని అని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. బనగానపల్లె స్థానిక పెట్రోల్ బంకు కూడలిలో శుక్రవారం నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇక బనగానపల్లె నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే రామిరెడ్డి అడ్డూ అదుపు లేకుండా అరాచకాలు సాగిస్తున్నారన్నారు. మైనింగ్ యజమానులకు లీజుకు ఇవ్వాలన్నా, రాయల్టీలు ఇవ్వాలన్నా కమీషన్లు తీసుకుంటున్నాడని ఆరోపించారు. కొంత మంది ఎస్సీ, ఎస్టీలను బినామీలుగా పెట్టుకొని కబ్జాలు సాగిస్తున్నాడని, సిమెంటు ఫ్యాక్టరీల నుంచి కమీషన్లు, ఇక కొంతమంది రౌడీలతో బొలేరో బ్యాచ్‌లతో అరాచకాలు సాగిస్తున్నాడని ధ్వజమెత్తారు. నాటుసారా అమ్మకాల్లో కూడా ఆయన హస్తం ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే బనగానపల్లెను అన్ని రకాలుగా ఆదుకుంటామని, ఇక్కడ నిరుపేదలకు రెండు సెంట్ల భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. నాపరాయి పరిశ్రమను ఆదుకుంటామని, బనగానపల్లెకు రింగు రోడ్డు, కోయిలకుంట్లకు బైపాస్ రోడ్డు, బనగానపల్లెలో ఇంజనీరింగ్ కళాశాల, బనగానపల్లె, కోయిలకుంట్లలో పెండింగ్‌లో ఉన్న షాదిఖానాల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. అలాగే బనగానపల్లెలో ఆటోనగర్ ఏర్పాటు చేస్తామని, బనగానపల్లె, కొలిమిగుండ్లలో సిమెంటు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసే వారికే భూములు ఇస్తామని, పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు.



రాయలసీమకు తీవ్ర అన్యాయం చేసిన జగన్..

రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్‌ను అందుబాటులోకి తెచ్చామని, రాయలసీయను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు కృషి చేశామని చెప్పారు. నందికొట్కూరులో మెగా సీడ్ పార్కుతోపాటు, జైన్ ఇరిగేషన్‌ను కూడా తీసుకువచ్చామని, అలాగే ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కును తీసుకువచ్చేందుకు అన్ని ప్రయత్నాలు చేశామని తెలిపారు. కానీ జగన్ వచ్చాక వాటన్నింటిని పక్కకు పెట్టడంతో ఇక్కడ యువతకు ఉపాధి లభించకుండా పోయిందన్నారు. ఓర్వకల్లులో వెయ్యి మెగావాట్ల విద్యుత్ పరిశ్రమను తీసుకువస్తే అది తన ఘనతగా జగన్ చెప్పుకుంటున్నాడని, అలాగే ఓర్వకల్లు విమనాశ్రయాన్ని రూ.90 కోట్లతో తాను పూర్తి చేసి ప్రారంభించానని, జగన్ అధికారంలోకి వచ్చాక తాను పూర్తి చేసినట్లు తన పార్టీ రంగులు వేసుకుని, తన తండ్రి విగ్రహాన్ని ఆవిష్కరించారని దుయ్యబట్టారు. నదుల అనుసంధానంతో గోదావరి జలాలను రాయలసీమకు తీసుకువచ్చి రాయలసీమను మరో కోనసీమగా మార్చాలని ప్రయత్నించానని, అందులో భాగంగా రూ.12 వేల కోట్లను రాయలసీమ ప్రాజెక్టుల కోసం ఖర్చు చేశానని చెప్పారు.

సొంత కొడుకు పేరిట భూములు..

ప్రజాగళం సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడటానికి ముందు బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యేగా ఉన్న రామిరెడ్డిని ఖాదీ గ్రామోద్యోగ సమితి సభ్యులు కస్టోడియన్‌గా ఎన్నుకోగా, ఆ సమితికి చెందిన భూములను కబ్జా చేసేందుకు పన్నాగం పన్నారని, అందులో భాగంగా తన కొడుకు పేరిట సంవత్సరానికి రూ.12 వేల చొప్పున 99 సంవత్సరాలకు లీజు రాయించుకున్నాడని, అలాగే పలు భూములను బినామీ పేర్లతో హస్తగతం చేసుకున్నాడని ఆరోపించారు. కొలిమిగుండ్లకు చెందిన బీసీ నాయకుడైన సుబ్బారావును దారుణంగా హత్య చేయించాడని అన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో టీడీపీకి చెందిన వందల మంది నాయకులపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేశాడన్నారు. బనగానపల్లె పట్టణంలో దొంగ పట్టాలు ఇచ్చి పేదలను వంచించాడని, అలాగే ప్రస్తుతం ఇంటి పట్టాలంటూ పేదల నుంచి కోట్లు వసూలు చేశాడన్నారు. రవ్వలకొండలో మైనింగ్ చేసి దోచుకున్నాడని, బనగానపల్లె పట్టణంలో వెంచర్ యజమానులు నుంచి భారీ ఎత్తున కమీషన్లు దండుకుంటున్నాడన్నారు. గోరుకల్లు రిజర్వాయర్‌ను పూర్తి చేసి 13 టీఎంసీల నీటిని నిల్వ చేసిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు. అలాగే ఇక్కడి నుంచి కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాల వరకు నీటిని తీసుకువెళ్లే అవుకు టన్నెల్ నిర్మాణం కూడా చంద్రబాబు హయాంలోనే జరిగిందని తెలిపారు.

చంద్రన్న రాజ్యం కావాలా.. రౌడీ రాజ్యం కావాలా?

ఇదే సభలో నంద్యాల టీడీపీ అభ్యర్థి బైరెడ్డి శబరి మాట్లాడుతూ ఈ ఐదేళ్లలో రౌడీ రాజ్యం సాగిందన్నారు. రైతులు సాగునీరు అడిగితే, వారికి నోటీసులు ఇచ్చి వేధింపులకు గురిచేశారన్నారు. చంద్రబాబు అధికారంలోనికి వస్తేనే వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కాటసాని రామిరెడ్డి కబ్జాదారుడని, అలాంటి వారిని తరిమి కొడదామన్నారు. వైసీపీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి కల్తీ విత్తనాలతో రైతులను దగా చేస్తున్నారని, అలాంటి ఎంపీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావుటీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్, బనగానపల్లె నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన, ఎమ్మార్పీఎస్ నాయకులు వేలాదిగా పాల్గొన్నారు.


చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న బీసీ, శబరి, గోగిశెట్టి


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న చెరుకుచెర్ల రఘురామయ్య


సెల్‌ఫోన్లతో చంద్రబాబు ఫొటోలు తీసుకుంటున్న యువకులు



ముగిసిన తెప్పోత్సవం

అహోబిలం పీఠాధిపతికి వీడ్కోలు


కోనేటిలో విహరిస్తున్న ప్రహ్లాద వరదస్వామి, అమ్మవార్లు

నంద్యాల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి, అమృతవల్లి అమ్మవార్ల తెప్పోత్సవం శుక్రవారం ముగిసింది. దీంతో దిగువ అహోబిలం బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. తెప్పోత్సవం కార్యక్రమంలో చివరి రోజున స్వామి అమ్మవార్ల విహారయాత్ర ముగిసింది. అనంతరం అహోబిలం లక్ష్మీనరసింహస్వామి పీఠాధిపతి రంగనాథయతీంద్రమహాదేశికన్‌కు వేదపండితులు వీడ్కోలు పలికారు.

హైకోర్టు న్యాయాధికారి పూజలు

అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామికి హైకోర్టు న్యాయమూర్తి సురేష్‌రెడ్డి కుటుంబ సమేతంగా శుక్రవారం పూజలు చేశారు. ఈయన రాకను పురస్కంచుకొని వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు ఇచ్చారు.

పది మూల్యాంకనానికి సర్వం సిద్ధం

డీఈఓ సుధాకర్‌రెడ్డి

పాణ్యం, మార్చి 29 : ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి విద్యాశాఖ నిర్వహించే పది స్పాట్ వాల్యుయేషన్‌కు సర్వం సిద్ధం చేసినట్లు నంద్యాల జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి 8వ తేదీ వరకు శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో పదో తరగతి పరీక్షా పేపర్లు దిద్దే కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పరీక్ష పేపర్లు దిద్దే ఉపాధ్యాయులు విధులకు సక్రమంగా హాజరు కావాలని కోరారు. ఎనిమిది రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లాలోని 11 వందల మంది ఉపాధ్యాయులు హాజరు కానుండగా మరో 20 శాతం మందిని అదనంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నంద్యాల జిల్లాకు ఎక్కువ పేపర్లు కేటాయించారన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా పేపర్లు కేటాయించిన జిల్లాగా నంద్యాల ఉందన్నారు. కర్నూలు జిల్లాకు లక్షా 60 వేలు కేటాయించగా నంద్యాల జిల్లాకు 2. 38 లక్షల పేపర్లు కేటాయించారని తెలిపారు. స్పాట్ వ్యాల్యుయేషన్‌లో సీనియారిటీకి ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. అనారోగ్యంగా ఉన్న ఉపాధ్యాయులను ఇందులో మినహాయించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరాయని వివరించారు. వారి సూచనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. కాగా అనారోగ్యానికి గురైన ఉపాధ్యాయులను మినహాయించాలని కోరగా డీఈఓ సంఘాలకు షోకాజ్ నోటీసులు అందజేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్స్ జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, గోస్పాడు ఎంఈఓ2 సురేంద్రనాథ్, ఎస్టీయూ, ఏపీటీఎఫ్, ఎస్టీఎఫ్, యూటీఎఫ్ సంఘాల నాయకులు ఆజంబేగ్, శివయ్య, రామకృష్ణ, మౌలాలి, తదితర నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

ఎండిన బోరు

పాడిగేదెలకు వదిలేసిన వరిపంట

రుద్రవరం, మార్చి 29 : మండలంలోని కొండమాయపల్లె గ్రామానికి చెందిన రైతు శ్రీనివాసరెడ్డి వెలగలపల్లె రెవెన్యూ పరిధిలో రెండు ఎకరాల్లో వరి పంట సాగు చేశాడు. వ్యవసాయ బోరుబావి ఎండిపోయింది. దీంతో శుక్రవారం రెండు ఎకరాల వరి పంటలోకి పాడిగేదెలను వదిలేశాడు. నీరందక పొలం బీటలువారి సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన చెందాడు.


పాడిగేదెలకు వదిలిన వరిపంట

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన చెరకుచెర్ల రఘురామయ్య దంపతులు

నందికొట్కూరు మార్చి 29: నందికొట్కూరులో వైసీపీకి షాక్ మీద షాక్ తగులుతోంది. ఎమ్మెల్యే ఆర్థర్ వర్గానికి చెందిన చెరుకుచెర్ల రఘురామయ్య, ఆయన సతీమణి రామతులసమ్మ, తమ్మడపల్లి విక్టర్, వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సగినెల రమణ, బాలస్వామి, తదితరులు బనగానపల్లెలో అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో ఆయన వర్గంలోని ప్రముఖులైన వీరితో పాటు వందల సంఖ్యలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో తమ్మడపల్లి రాజ్‌కుమార్, తమ్మడపల్లి నవీన్‌కుమార్, కృపాకర్, మధుసుదన్‌రాజు, తదితరులు ఉన్నారు.

బైరెడ్డి సమక్షంలో..



పారుమంచాలలో బైరెడ్డి శబరి, రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

జూపాడుబంగ్లా, మార్చి 29: మండలంలోని పారుమంచాల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు శుక్రవారం టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి సమక్షంలో 200 కుటుంబాల వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరి కండువా కప్పుకున్నారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కర్ణాకర్‌రెడ్డి, చెంచిరెడ్డి, శేఖర్‌రెడ్డి ,రమణారెడ్డి, ఎల్లయ్య, బాలవెంకటరమణ, నన్నెసాహెబ్, మౌలాలి, పుల్లయ్య, రాముడుతోపాటు దాదాపు 200 కుటుంబాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో కాకరవాడ చిన్నవెంకటస్వామి, వెంకటేశ్వర్లు, మాణిక్యరాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ

శ్రీశైలం, మార్చి 29: శ్రీశైల మహా క్షేత్రంలో చైత్ర మాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం లేదా శుక్రవారం రోజున భ్రమరాంబ అమ్మవారికి కుంభోత్సవం జరిపించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఏప్రిల్ 26న కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి సాత్విక బలి నిర్వహించేందుకు కుంభోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభ హారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. ఈ కుంభోత్సవాన్ని పురస్కరించుకొని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే వచ్చే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించడం జరుగుతుంది. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాధికాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు.

వైభవంగా ఊయల సేవ

శ్రీశైలం, మార్చి 29: శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయలసేవను ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా మహాగణపతి పూజను చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఊయలలో ఆశీనులనుజేసి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపారు. అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్ర నామపూజలు, స్వామివారికి సహస్రనామార్చన పూజలు నిర్వహించి మంగళహారతులను సమర్పించారు.

● శ్రీశైల క్షేత్ర గ్రామదేవత అంకాలమ్మకు శుక్రవారం లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. అమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అలంకరణ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

పల్లకిలో ఊరేగిన మహానందీశ్వరుడు

మహానంది, మార్చి 29: మహానంది క్షేత్రంలో శుక్రవారం రాత్రి పల్లకి సేవ ఉత్సవాన్ని వేదపండితులు, అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు పూజలు జరిపారు. అలంకార మండపంలో ఉత్సవమూర్తుల విగ్రహాలను పల్లకిపై ఆశీనులు గావించారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం మేళతాళాలతో పల్లకి ఉత్సవాన్ని ఆలయం ప్రాంగణంలో భక్తుల శివనామస్మరణ మధ్య నిర్వహించారు.

'జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం'

నందికొట్కూరు, మార్చి 29: సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నందికొట్కూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య అన్నారు. శుక్రవారం బాబు సూపర్ 6, శంఖారావం కార్యక్రమంలో భాగంగా మిడ్తూరు మండలం అలగనూరు గ్రామంలో నందికొట్కూరు ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య పర్యటించారు. టీడీపీ మ్యానిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలను గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. జయసూర్య మాట్లాడుతూ గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణాన్ని విస్మరించి, నంద్యాల జిల్లాలో సాగునీటి ప్రాజెక్టును పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. జిల్లాకు ఏ అభివృద్ధి చేయని సీఎం పర్యటనకు రావడం సిగ్గుచేటన్నారు. మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మాండ్ర పురుషోత్తం రెడ్డి, సున్నంపెల్ల శ్రీనివాసులు, రామచంద్రుడు, ఫాజిల్ హుస్సేన్, బాలరాజు, కురువ శ్రీనివాసులు, అతూర్ రెహమాన్, శేషన్న, ఉసేన్ బాషా, అనుదీప్, చిన్న స్వామి, బాలుడు, వెంకటేశ్వర్లు, అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.



నందికొట్కూరులో జెండాను ఆవిష్కరిస్తున్న మాండ్ర

నందికొట్కూరు, మార్చి 29: పేద వర్గాల కోసం అంకిత భావంతో పని చేసిన పార్టీ టీడీపీ అని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నందికొట్కూరులోని ఆయన నివాసంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాల కోసం అంకిత భావంతో పని చేస్తున్న పార్టీ టీడీపీ అని అన్నారు. నేడు పేద వర్గాలంతా నిరుద్యోగులుగా మిగిలిపోయేలా చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, బంగారు వెంకటేశ్వర్లు, సాహెబ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు. కొత్తపల్లి మండలం ఎర్రమఠం, జూపాడుబంగ్లా మండలం తర్తూరు గ్రామాలకు చెందిన కొందరు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

● టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నందికొట్కూరులోని పార్టీ కార్యాలయం ఎదుట శుక్రవారం జెండాను ఆవిష్కరించారు. టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలన పట్ల ప్రజలు విసిగిపోయారని, ఓటు ద్వారా జగన్‌ను ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అందుకు నిదర్శనం జగన్మోహన్‌రెడ్డి సభలకు కూడా జనం రావడానికి ఇష్టపడడం లేదన్నారు. నందికొట్కూరులో ఒక్కొక్క బస్సుకు రూ.10 వేలు ఇచ్చి జనాలను తరలించేందుకు ప్రయత్నించినా నామమాత్రపు స్పందన వచ్చిందన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పతనం నంద్యాల సభ నుంచే మొదలైందన్నారు. టీడీపీ అధినేతన బనగానపల్లెలో నిర్వహించిన ప్రజా గళం కార్యక్రమంలో మండుటెండను సహితం లెక్కచేయకుండా ఎండలో నిలబడి జనం సభను జయప్రదం చేశారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య మాట్లాడుతూ 42 ఏళ్లలో బీసీ, ఎస్సీఎస్టీ అనగారిన వర్గాల ప్రజలకు రాజకీయ భవిష్యత్తుకు పునాది వేసిన పార్టీ టీడీపీ అన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, పలచాని మహేశ్వర్‌రెడ్డి, ముర్తుజావలి, లాయర్ జాకీర్, వేణుగోపాల్, నిమ్మకాయల రాజు, రాజన్న, శాంతరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షుడు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించడంతో పాటు దివంగత నేతలు ఎన్టీఆర్, బుడ్డా వెంగళరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అదేవిధంగా అక్కడే కేక్‌కట్ చేసి టీడీపీ శ్రేణులతో కలిసి సంబరాలు జరుపుకొన్నారు. నాయకులు శాకమూరి గిరిరాజు, అబ్దుల్లాపురం బాషా, ఫక్రుద్దీన్, ఆర్టీసీ రామకృష్ణ, కొప్పరపు రవిప్రసాద్, రమేష్‌గౌడ్, దినకర్, నాగేశ్వరరావునాయక్, మోహన్, రామనర్సయ్య ఉన్నారు.

జూపాడుబంగ్లా: టీడీపీ ఆవిర్భావం సందర్భంగా జూపాడుబంగ్లాలో శుక్రవారం పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. పేదల సంక్షేమమే టీడీపీ పనిచేస్తుందని ఆ పార్టీ నాయకులు వెంకటేశ్వర్లుయాదవ్, గిరీశ్వరరెడ్డి అన్నారు. టీడీపీ నాయకులు పిక్కిలి శ్రీనివాసులు, రమణారెడ్డి, రవికుమార్‌యాదవ్, జంగాలపెద్దన్న, రవికాంత్, బాబు, వీరారెడ్డి, మన్సూర్‌బాషా, సోమశేఖర్‌గౌడు, శేఖర్‌గౌడు, సంపత్‌కుమార్‌యాదవ్, శాలుబాషా, కృష్ణారెడ్డి, సామన్న తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల (నూనెపల్లె): దేశ రాజకీయాలలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం ఓ చారిత్రాత్మకమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నంద్యాలలోని ఖలీల్ థియేటర్ ఆవరణలోని టీడీపీ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎండీ ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరై టీడీపీ జెండాను ఎగురవేశారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రారావు, ఏవీఆర్ ప్రసాద్, తాతిరెడ్డి తులసిరెడ్డి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందనాయుడు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, నంద్యాల నియోజకవర్గ టీడీపీ శ్రేణులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



నంద్యాలలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఫరూక్

● నంద్యాలలో గురువారం జరిగిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సభ అట్టర్ ఫ్లాప్ అయిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నంద్యాలకు ఏం చేశారో చెప్పాలని అడిగితే చెప్పకుండా దాటవేసి పోయారని విమర్శించారు. నంద్యాల సర్వనాశనం కావడానికి శిల్పా కుటుంబమే కారణమని, 20 సంవత్సరాల నుంచి మున్సిపాలిటీ తమ అధీనంలో పెట్టుకొని రూ.కోట్లకు కోట్లు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు.

పాణ్యం: పాణ్యంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టీడీపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి రాంమోహన్‌నాయుడు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసమే టీడీపి ఆవిర్భవించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రంగరమేష్, రమణమూర్తి, ఖాదర్‌బాషా, జనసేన మండల కన్వీనర్ జగదీశ్ బాబు, ప్రభాకర్, సుబ్బయ్య, మహేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహానంది: పేద ప్రజల సంక్షేమం కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం అని మహానంది మండల టీడీపీ నాయకులు తెలిపారు. టీడీపీ 42 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మహానందిలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మహానంది సమీపం లోని టీడీపీ కార్యాలయం ఆవరణలో వందలాదిమంది మండలంకు చెందిన కార్యకర్తలు పాల్గొనగా మహానంది టీడీపీ ఇన్‌చార్జ్‌లు గని చిన్న రంగస్వామి, సూరే శ్రీనివాసులు ఆధ్వర్యంలో నాయకులు భారీ కేక్‌ను కట్ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు మధు, నాయకులు గడ్డం నాగపుల్లయ్య, మౌళీశ్వరరెడ్డి, జనార్దన్‌రెడ్డి, కంచెర్ల శివ తదితరులు పాల్గొన్నారు.



జూపాడుబంగ్లాలో ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న నాయకులు



పాణ్యంలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళి



మహానందిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో 'గుడ్ ఫ్రైడే'



నంద్యాలలో హోలీక్రాస్ కెథడ్రిల్ చర్చిలో పాల్గొన్న క్రైస్తవులు

నంద్యాల (కల్చరల్), మార్చి 29: గుడ్ ఫ్రైడేను నంద్యాలలో ఘనంగా నిర్వహించారు. యేసుక్రీస్తు జీవితాన్ని త్యాగాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని నంద్యాల డియోసెస్ ఫాదర్లు రెవరెండ్ పాల్‌రాజరావు, రెవరెండ్ నందం ఐజక్ పేర్కొన్నారు. నంద్యాల హోలీక్రాస్ కెథడ్రిల్ చర్చిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఏసుక్రీస్తు సిలువపై పలికిన ఏడు మాటలను తన సందేశంద్వారా వినిపించారు. కార్యక్రమంలో చర్చి డీనరరీ చైర్మన్ జోసఫ్, రెవరెండ్ భాస్కర్‌రావు, రెవరెండ్ స్వరూప్ రాజ్, సెక్రటరీ బైళ్ల ప్రభుదాసు, ట్రెజరర్ స్టీవెన్, కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే ఘనంగా జరుపుకున్నారు. వివిధ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పండగప్రత్యేకతను గురించి భక్తులకు మతపెద్దలు బోధించారు.

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని అన్ని చర్చిలలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి క్రైస్తవులు ఉపవాసాలు ఆచరించారు. అనంతరం సమీప చర్చిల్లో పాల్గొని దైవ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా చర్చిలలో పాస్టర్లు భగవంతుని ప్రబోధాలను వివరించారు.

ఆత్మకూరు రూరల్: మండలంలోని అన్ని గ్రామాలలోని ఆయా చర్చిలలో శుక్రవారం గుడ్ ఫ్రైడేను ఘనంగా జరిగాయి. చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో శిలువను ఊరేగిస్తూ భక్తిగీతాలను ఆలపిస్తూ యాత్రలను నిర్వహించారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో గుడ్ ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాలలోని చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. వెలుగోడు పట్టణంలో ఆర్సీఎం చర్చి నుంచి ప్రధాన రహదారి వెంట శిలువను మోసుకెళ్తూ క్రీస్తు జీవిత చరిత్ర గురించి వివరిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.

గోస్పాడు: గుడ్ ఫ్రైడే సందర్భంగా మండలంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

గడివేముల: మండలంలో క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడేను నిర్వహించారు. యేసు గీతాలను ఆలపిస్తూ భుజాన శిలువను మోస్తూ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.



బూజనూరులో శిలువను మోస్తున్న క్రైస్తవులు



వెలుగోడులో..



ఆత్మకూరులో..

నియమావళి ఉల్లంఘన

● ఎన్నికల విధుల్లో స్థానిక అధికారులు

నంద్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల విధుల్లో స్థానిక జిల్లా అధికారులకు విధులు నిర్వర్తించాలని అధికారులు జారీ చేసిన ఉత్తర్వులు పలు అనుమానాలకు తావిస్తోంది. స్థానికంగా జిల్లా అధికారిగా పని చేస్తున్న వారిని అదే జిల్లాలో ఎన్నికల విధుల్లో నియమించరాదనేది ఎన్నికల నియమావళి చెబుతోంది. అయితే ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ నంద్యాలకు చెందిన జిల్లా సివిల్ సప్లయ్ అధికారి బి.రాజును ఎన్నికల నోడల్ అధికారిగా, కర్నూలుకు చెందిన సైనిక్ వెల్ఫేర్ అధికారి రంతా రూతును రిజర్వ్ నోడల్ అధికారిగా నియమించారు. వీరిని స్థానికంగానే ఎన్నికల విధుల్లో అధికారులు నియమించడంపై పలు అనుమానాలకు తావిస్తున్నాయి.

టీడీపీ నాయకుడి మృతికి నివాళి



నివాళి అర్పిస్తున్న భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల రూరల్, మార్చి 29: నంద్యాల మండలంలోని పోలూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గోపిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి గుండెపోటుతో మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానంద రెడ్డి శుక్రవారం పోలూరు గ్రామానికి వెళ్లి నాయకుడి భౌతికకాయానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

మాజీ సర్పంచ్ మృతికి ప్రముఖుల సంతాపం



నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి

వెలుగోడు, మార్చి 29: వెలుగోడు పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ సయ్యద్ సులేమాన్ (77) గుండెపోటుతో గురువారం రాత్రి కన్నుమూశారు. శుక్రవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, సర్పంచ్ జయపాల్, మాజీ సర్పంచ్‌లు అబ్దుల్ కలాం, తిరుపాల్ రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్ తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రముఖులు, టీడీపీ రాష్ట్ర నాయకులు రజాక్, తదితరులు నివాళి అర్పించారు.

'ప్రతాపరెడ్డి మృతి టీడీపీకి తీరనిలోటు'

గోస్పాడు, మార్చి 29: మండలంలోని ఒంటివెలగల గ్రామానికి చెందిన చింతకుంట్ల ప్రతాపరెడ్డి (63) మృతి టీడీపీకి తీరనిలోటని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నంద్యాల నియోజకవర్గ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. గుండెపోటుతో మరణించిన ప్రతాపరెడ్డి మృతదేహానికి శుక్రవారం ఫరూక్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ గోస్పాడు మండల అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి నివాళి అర్పించారు.

'ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి'

నంద్యాల (నూనెపల్లె), మార్చి 29: సాధారణ ఎన్నికల విధుల నుంచి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, రాష్ట్ర కార్యదర్శి నగిరి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు 6 నెలలోపు పదవీ విరమణ పొందే ఉపాధ్యాయులకు, చంటి బిడ్డ తల్లులకు, గర్భిణులకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవ స్వామి, సాంబశివుడు, పుల్లయ్య, పవన్‌కుమార్, మునిస్వామి, రవి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ సభకు హాజరైన ఇద్దరిపై వేటు

ఆత్మకూరు, మార్చి 29: వెంకటాపురం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గ్రామానికి చెందిన సుధాకర్, ఎండీయూ ఆపరేటర్‌గా పని చేస్తున్న కృష్ణాపురం గ్రామానికి చెందిన బండి రఘునాథరెడ్డిపై వేటు పడింది. వీరిద్దరూ నంద్యాలలో గురువారం జగన్ సభకు తరలివెళ్లడంతో ఆధారాలతో సహా సి-విజిల్ యాప్ ద్వారా గురువారం టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎన్నికల అధికారులు విధుల నుంచి తొలగించాలని ఆదేశించడంతో ఆయా శాఖల ఉన్నతాధికారులు వారిని తొలగించారు.

గాజులపల్లి వలంటీరుపై ఫిర్యాదు

మహానంది, మార్చి 29: గాజులపల్లి సచివాలయం-2 వలంటీర్ దాదాబాషాపై గ్రామానికి చెందిన కొందరు సీ విజిల్ యాప్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. వలంటీర్ గురువారం సీఎం జగన్ నంద్యాల బస్సు యాత్రలో భాగంగా సిద్ధం బహిరంగ సభలో పాల్గొనడానికి వెళ్తున్న గ్రామ ఎంపీటీసీతోపాటు మరికొందరిని ఒక యూట్యూబ్ చానల్ రిపోర్టర్ పేరుతో ప్రతి పక్ష నేతలను విమర్శించే విధంగా వారితో మాట్లాడించి చిత్రీకరించారు. దీనిపై గ్రామానికి చెందిన కొందరు సీ యాప్‌కు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై నియోజకవర్గ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి మనోహర్ గాజులపల్లి చేరుకొని విచారించారు. ఈవిషయంపై ఉన్నతాధికారుకు నివేదికలను పంపుతున్నట్లు ప్రత్యేక అధికారి తెలిపారు.

భక్తులతో గౌరవంగా మెలగాలి: ఈవో



దుకాణదారులతో మాట్లాడుతున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, మార్చి 29: శ్రీశైలం దేవస్థానం పరిధిలోని దుకాణదారులు భక్తులతో గౌరవంగా మెలగాలని ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.పెద్దిరాజు సూచించారు. శుక్రవారం దుకాణదారులో సమావేశాన్ని నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ ఏప్రిల్ 6 నుంచి 10వ తేదీ వరకు ఉగాది మహోత్సవాలు జరగనున్నాయని, ఈ సందర్భంగా ఏప్రిల్ 1 నుంచే కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి వచ్చే అవకాశం ఉందని అన్నారు. దుకాణాలలో విక్రయించే వస్తువులు, తినుబండారాలు తదితర వాటి ధరల పట్టికను హిందీ, ఇంగ్లీష్, కన్నడ, తెలుగు భాషలలో దుకాణాల వద్ద ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా హోటల్ నిర్వాహకులు శుచిశుభ్రతను విధిగా పాటించాలని, నిర్ణీత ధరలకే తిను పదార్థాలను విక్రయించాలని సూచించారు. సీఐ జి.ప్రసాదరావు మాట్లాడుతూ దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎస్ఐ జి.లక్ష్మణరావు, దేవస్థానం రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంత లేదు.. ఇంత లేదు..!


జనం లేక వెలవెలబోతున్న సభ

- లక్ష జనం వస్తారని అన్నారు.. పాతిక వేలు కూడా దాటలేదు
- పూర్ షోగా మారిన ఎమ్మిగనూరు మేము సిద్ధం సభ
- ఎమ్మెల్యే ఎర్రకోటకు అవమానం
- చేనేతల ఊసే ఎత్తని సీఎం జగన్
- బుట్టా రేణుక విన్నపాలకు స్పందన కరువు

కర్నూలు, మార్చి 29(ఆంధ్రజ్యోతి)/ఎమ్మిగనూరు: సార్వత్రిక ఎన్నికల ముందు సీఎం జగన్ చేపట్టిన ప్రచార బస్సు యాత్రలో భాగంగా సిద్ధం సభను సూపర్..డూపర్ సక్సెస్ చేస్తామని వైసీపీ నాయకులు అంచనాలు వేశారు. పల్లెపల్లెకు, వార్డు వార్డుకు డబ్బులు, మద్యం పంపిణీ చేశారు. ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సులను పంపారు. ఏడు నియోజకవర్గాల నుంచి జనం లక్షకు పైగా వస్తారని పెద్ద ఎత్తున ప్రగల్భాలు పలికారు. తీరా పాతిక వేల మంది కూడా దాటలేదు. సీఎం జగన్ ప్రసంగిస్తుండగానే గుంపులు.. గుంపులుగా జనం వెళ్లిపోయారు. సభ ముందు వైపు ఉన్న గ్యాలరీలు మొత్తం ఖాళీ అయ్యాయి. ఈ స్థితి చూసి ఎందుకు ఇలా జరిగిందని వైసీపీ కార్యకర్తలు కొందరు చర్చించుకోవడం కొసమెరుపు. ఎన్నికల నేపథ్యంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రచారంలో భాగంగా 21 రోజుల బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారు. మూడో రోజు శుక్రవారం గూడూరు మండలం పెంచికలపాడు నుంచి బస్సు యాత్ర మొదలైంది. కోడుమూరు, వేముగోడు, హెచ్ కైరవాడి, గోనెగండ్ల మీదుగా సాగింది. ఎమ్మిగనూరు మండలం రాళ్లదొడ్డి సమీపంలో మధ్యాహ్నం విశ్రాంతి తీసుకున్నారు. సాయంత్రం 5.30 గంటలకు వీవర్స్ కాలనీ మైదానంలో సభ ప్రారంభమైంది. అప్పటికే పట్టణంలోని వివిధ వార్డుల నుంచి వచ్చిన మహిళలు వెళ్లిపోయారు. సీఎం జగన్ ప్రసంగిస్తుండగా మరికొందరు వెళ్లిపోయారు. ఎమ్మిగనూరు సభ జనం లేక ఫ్లాప్‌షోగా మారిందని పలువురు చర్చించుకున్నారు. కోడుమూరు మండలం కొత్తూరు వద్ద మహిళలు ఖాళీ బిందెలతో నీటి సమస్య తీర్చాలని నిరసన తెలిపారు. కోడుమూరుకు ఎస్ఎస్ ట్యాంకు నిర్మించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐ నాయకులు, కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.


సభ నుంచి వెళ్లిపోతున్న మహిళలు

ఎమ్మెల్యే ఎర్రకోటకు అవమానం

ఎమ్మిగనూరులో 1994 నుంచి గతేడాది అక్టోబరులో జరిగిన చేదోడు సభ వరకు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి హవానే సాగింది. నాడు దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అయినా.. నేడు సీఎం జగన్ అయినా ఎర్రకోటను పొగడ్తలతో ముంచెత్తేవారు. అయితే.. వయోభారం వల్ల ఎర్రకోట గెలవలేరనే సాకుతో ఆయన కుమారుడు ఎర్రకోట జగన్మోహన్‌రెడ్డికి సీఎం జగన్ టికెట్ నిరాకరించారు. మాజీ ఎంపీ బుట్టా రేణుకను బరిలోకి దింపారు. శుక్రవారం జరిగిన తాము సిద్ధం సభలో అభ్యర్థి బుట్టా రేణుక కాని, సీఎం జగన్ కాని ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పేరు ఉచ్చరించకుండానే ప్రసంగించారు. బుట్టా రేణుక ఎమ్మెల్యేగారు.. అన్నారే తప్ప చెన్నకేశవరెడ్డి పేరు ప్రస్తావించలేదు. దీన్ని సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఎర్రకోటకు పరాభావంగా ఆయన సన్నిహితులే చర్చించుకోవడం కొసమెరుపు.

సిద్ధం సభతో ట్రాఫిక్ ఇబ్బందులు

ఎమ్మిగనూరులో సీఎం జగన్ మేము సిద్ధం సభతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. కర్నూలు ప్రధాన రహదారితో పాటు ఆదోని- మంత్రాలయం జాతీయ రహదారులపై సభకు వచ్చిన బస్సులు రోడ్డుపై ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో కర్నూలు, మంత్రాలయం వైపు వెళ్లే ప్రయాణికులకు ట్రాఫిక్ సమస్య తప్పలేదు. గంటలు తరబడి రోడ్డుపైనే వాహనాలు నిలిచిపోవడంతో జనం అసహనం వ్యక్తం చేశారు. ప్రధానంగా సభ నిర్వహించిన వీవర్స్ కాలనీ మైదానం సమీపంలో ఉన్న జాతీయ రహదారి ఎంజీ సర్కిల్‌లో సభకు జనాన్ని తరలించిన బస్సులు తిరిగి వెళ్లే క్రమంలో కూడలిలోనే నిలిచిపోయాయి. దీంతో ట్రాఫిక్ జామయ్యింది. పట్టణంలో నుంచి శిల్పా ఎస్టేట్, మిలటరీ కాలనీ, వెంకటాపురం, సోమప్ప నగర్, మార్కెట్ కమిటీ వైపు వెళ్లే జనం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పోలీసులు సైతం ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంలో విఫలమయ్యారు.

చేనేతలకు ఇచ్చిన గౌరవం ఇదేనా..?

చేనేతపురిగా పేరుగాంచిన ఎమ్మిగనూరులో నిర్వహించిన తాము సిద్ధం సభలో సీఎం జగన్ చేనేతల ఊసే ఎత్తకపోవడం సర్వత్రా చర్చగా మారింది. చేనేతల అభివృద్ధి కోసం హామీలు ఇస్తారని ఎంతో ఆశగా ఎదురు చూశారు. హామీ మాట దేవుడెరుగు.. కనీసం ఆ పదం కూడా ఉచ్చరించకపోవడం కొసమెరుపు. అయితే.. ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక మాట్లాడుతూ అన్నా.. ఎమ్మిగనూరులో నీటి సమస్య ఉంది.. ఎస్ఎస్ ట్యాంకు నిర్మించాలి, చేనేతలకు ఉపాధి కల్పించేందుకు టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయాలని.. ఈ రెండు సమస్యలు తీర్చాలన్నా.. అంటూ విన్నవించింది. జగన్ వాటిని ఏ మాత్రం పట్టించుకోకపోవడం రాజకీయంగా విమర్శలకు తావిస్తోంది. కార్యక్రమంలో సీఎం జగన్ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను పరిచయం చేశారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకమ్మను తర్వాత పరిచయం చేస్తానని చెప్పిన జగన్ ఆ తర్వాత ఆమెను పరిచయం చేయకుండానే ముగించేశారు.

తొక్కిసలాటలో ఇద్దరికి గాయాలు

మేము సిద్ధం సభలో సభా వేదిక ముందు జరిగిన సిద్ధం సభలో ఇద్దరు గాయపడ్డారు. ఆదోనికి చెందిన గోవర్ధన్, బనవాసికి చెందిన ప్రసాద్‌లు బారికేడ్లు దాటేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో కిందపడ్డారు. ఆ సమయంలో జరిగిన తొక్కిసలాటలో వారిద్దరు గాయపడ్డారు. చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.





తాగారు..తూగారు

మేము సిద్ధం సభకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన కొంతమంది వైసీపీ కార్యకర్తలు మద్యం మత్తులో తూగి తూలారు.. సీఎం జగన్ ప్రయాణిస్తున్న బస్సు ఎమ్మిగనూరుకు రాక ముందు నుంచే, సభా ప్రారంభం కాకముందే మద్యం దుకాణాల దగ్గర ఎగబడి మద్యాన్ని కొనుక్కోవడం కనిపించింది. అంతేగాక దుకాణాల ముందు రోడ్డు పక్కన, రోడ్డుపైన మద్యం తాగుతూ చిందులేశారు. వైసీపీ టోపీలు, జెండాలు పట్టుకొని మద్యం తాగడం, వైసీపీ నాయకులు ఇచ్చిన బిర్యాని పొట్లాలు తీసుకొని తింటూ కనిపించారు.


మద్యం సేవిస్తూ..

ఘనంగా సుయతీంద్రతీర్థుల ఆరాధన

- ఉత్సవాలను ప్రారంభించిన పీఠాధిపతి
- బృందావనానికి పంచామృతాభిషేకం
- ఆకట్టుకున్న ప్రవచనాలు



మంత్రాలయం, మార్చి 29: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పూర్వ పీఠాధిపతి సుయతీంద్ర తీర్థుల 11వ మహా సమారాధనోత్సవాలు శుక్ర వారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మంత్రాలయం నవనిర్మాణ శిల్పిగా పేరొందిన సుయతీంద్రతీర్థుల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు, వెండి ఆభరణాలు, పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. యాగశాలలో పీఠాధిపతి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. పండితులు వినిపించిన సుయతీంద్రతీర్థుల ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేసి హారతులు ఇచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు శేషవస్త్రం, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పండిత కేసరి విద్వాన్ డా. రాజాఎస్ గిరిరాజాచార్, ఎస్ఎస్ వెంకటేశాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేశ్‌జోషి, శ్రీపతాచార్, ఐపీ నరసింహమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్ పాల్గొన్నారు.

మంగళసూత్రం చోరీ యత్నం

- దొంగను పట్టి పోలీసులకు అప్పగించిన బంధువులు

మంత్రాలయం, మార్చి 29: మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన ఓ మహిళ మెడలో మంగళసూత్రాన్ని చోరీకి యత్నిస్తుండగా బంధువులు వెంటపడి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆదోని మండలం కుప్పగల్లుకు చెందిన బోయ శ్రీనివాసులు, దేవేంద్రమ్మ దంపతులు తమ కుటుంబ సభ్యులతో రాఘవేంద్రస్వామి దర్శనానికి వచ్చారు. గురువారం రాత్రి నదీతీరంలో నిద్రిస్తుండగా మంత్రాలయానికి చెందిన రామక్రిష్ణ అనే వ్యక్తి దేవేంద్రమ్మ మెడలో ఉన్న మంగళసూత్రాన్ని తెంచుకుని పరారయ్యాడు. బంధువులు వెంటపడి నిందితుడ్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మంత్రాలయం ఎస్ఐ గోపీనాథ్ కేసు నమోదు చేసుకొని, నిందితున్ని కోర్టులో హాజరు పరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

30 ట్రాక్టర్ల గ్రాసం దగ్ధం

- రూ.10 లక్షల నష్టం


మద్దికెర, మార్చి 29: పశువుల కోసం బైలు స్థలంలో రైతులు నిల్వగా ఉంచుకున్న 30 ట్రాక్టర్ల గ్రాసం మంటలకు దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.10 లక్షల నష్టం వాటిల్లింది. శుక్రవారం మద్దికెర గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాల పరిసర ప్రాంతాల్లో నేసరి హనుమంతు 26 ట్రాక్టర్ల పశుగ్రాసం, నేసరి శీనప్ప 4 ట్రాక్టర్ల పశుగ్రాసం తమ బైలు స్థలంలో నిల్వగా ఉంచుకున్నారు. ఏడాదికి సరిపడ ఈ గడ్డికి నిప్పంటుకొని మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో మంటలు ఎగిసిపడ్డాయి. భారీ అగ్నిప్రమాదం కావడంతో మంటలు ఆర్పలేకపోయారు. సకాలంలో ఫైరింజన్లు కూడా రాలేకపోయాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారా? లేదా ఎవరైనా బీడి, సిగరెట్ తాగి పొరపాటున వదేసి వెళ్లారా? అన్నది తెలియాల్సి ఉంది. వీఆర్వో రంగస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని చెప్పారు. రైతులను ఆదుకోవాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు జమేదార్ రాజన్న యాదవ్, జిల్లా టీడీపీ నాయకులు ఎన్. లక్ష్మీనారాయణ, మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఉదయ్ కుమార్ కోరారు.

వ్యక్తి మృతి

ఓర్వకల్లు, మార్చి 29: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన కమ్మరి రామ్మోహన్ నాయుడు (45) శుక్రవారం ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు బ్రాహ్మణపల్లె గ్రామం నుంచి కాల్వ గ్రామానికి పని నిమిత్తం వెళ్లి స్వగ్రామం వస్తుండగా.. కాల్వ గ్రామ సమీపాన ద్విచక్రవాహనం నుండి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య జయంతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జగన్ చేసిన మోసాలు చాలు

- మంత్రి బుగ్గనను ప్రజలు ఓడించడం ఖాయం
- టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



డోన్, మార్చి 29: గత ఎన్నికల ముందు వైఎస్ జగన్ ఎన్నెన్నో హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలకు చేసిన మోసాలు చాలని, ఇక ఆయన్ను ఇంటికి పంపించాలని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం డోన్ పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా వైఎస్ జగన్ గత ఎన్నికల ముందు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాదయాత్ర చేసి 22 హామీలు ఇచ్చారని, వాటిలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని మండిపడ్డారు. రాష్ట్రంలోనే డోన్ నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని మాట ఇచ్చి మోసం చేయడం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. నాపరాయి పరిశ్రమలకు ఒక యూనిట్ విద్యుత్‌ను రూ.3.70 పైసలకే ఇస్తానని హామీ ఇచ్చి నియోజకవర్గ ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో హంద్రీ నీవా ద్వారా చెరువులకు నీళ్లు నింపి ప్రజలకు తాగు, వ్యవసాయ సాగునీరు అందించేందుకు రూ.230 కోట్లు నిధులు మంజూరు చేస్తే ఆ పనులను వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి ఆర్డీఎస్ కుడి కాలువ, ఎల్లెల్సీ కాలువకు కర్ణాటక భూభాగంలో పైపులైన్ నిర్మాణం, వేదవతి ఎత్తిపోతల పథకం, గుండ్రేవుల జలాశయ నిర్మాణ పనులకు జీవోలు జారీ చేయిస్తే.. వాటిని రద్దు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. డోన్ నియోజకవర్గంలో అటవీశాఖ చెందిన భూములను గనుల తవ్వకానికి కార్మికులకు లీజుకు ఇస్తానని హామీ ఇచ్చి మాట తప్పారని ఎద్దేవా చేశారు. టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పి దాని ఊసే లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు సీఎం జగన్ ఏ మొఖం పెట్టుకొని వచ్చారని, ఓట్లు అడిగే హక్కు ఆయనకు లేదని అన్నారు.

వచ్చే ఖరీఫ్‌లో అధిక దిగుబడినిచ్చే వేరుశనగ విత్తనాలు

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 29: వచ్చే ఖరీఫ్‌లో సాగు చేయడానికి అధిక దిగుబడి ఇచ్చే కొత్త రకం వేరుశగన విత్తనాలు రైతులకు పంపిణీ చేయడానికి సిద్ధమవుతున్నట్లు జేడీ వరలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో వేరుశనగ పంట సాగుపై గతంలో రైతులు ఎక్కువగా దృష్టి పెట్టారు. అయితే.. వర్షాభావం, తెగుళ్ల కారణంగా దిగుబడి పూర్తిగా తగ్గిపోయి పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడంతో ఈ పంట సాగు వల్ల రైతులు నష్టాలపాలయ్యారు. దీంతో గత ఐదేళ్లగా వేరుశనగ పంట సాగును రైతులు పెద్ద ఎత్తున తగ్గించారు. ప్రత్యామ్నాయంగా పత్తి సాగు వైపు ఆసక్తి పెంచుకున్నారు. దీంతో వంట నూనెల ధరలు పెరిగిపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూనెగింజల దిగుబడిని పెంచేందుకు ఇటీవల శాస్త్రవేత్తలతో పరిశోధనలు చేపట్టి మేలురకం వేరుశనగ విత్తనాల ఉత్పత్తికి శ్రీకారం చుట్టాయి. గత దశాబ్ద కాలంగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో కే-6 రకం వేరుశగన సాగు చేసేవారు. అదే విధంగా కదిరి, లేపాక్షి తదితర విత్తనాలను వాడేవారు. వచ్చే ఖరీఫ్ నుంచి వేరుశనగలో ఎక్కువ దిగుబడి ఇచ్చే కొత్తరకాలైన టీసీజీఎస్-1694 రకం విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేయడానికి వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కర్నూలు జిల్లాకు ఈ రకం విత్తనాలు 1200 క్వింటాళ్లను సిద్ధంగా ఉంచినట్లు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు. వేరుశనగలోనే కే. లేపాక్షి రకాన్ని అందుబాటులోకి తేవడానికి చర్యలు చేపట్టినట్లు జేడీ తెలిపారు. పప్పుశనగలో జే-సి-11కి ప్రత్యామ్నాయంగా ఎన్‌బీఈజీ-49, అదే విధంగా ఎన్‌బీఈఈ-49 రకాలను కంది పంట సాగులో ఎల్ఆర్‌జీ-41కి ప్రత్యామ్నాయంగా పీఆర్ఈ-176, పీఆర్‌జీ-158, ఎల్ఆర్‌జీ-52, ఐసీపీహెచ్-2740 వంటి రకాలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ రకం విత్తనాలు బెట్టను తట్టుకుంటాయని, తెగుళ్లు పెద్దగా ఆశించవని, దీనివల్ల ఖర్చులు తగ్గి, దిగుబడి పెరుగుతుందని జేడీ వరలక్ష్మి తెలిపారు.

వీడిన ఉత్కంఠ

ఆలూరు అభ్యర్థిగా వీరభద్ర గౌడ్



కర్నూలు, మార్చి 29 (ఆంధ్రజ్యోతి)/ఆలూరు: ఆలూరు టీడీపీ అభ్యర్థి ఎంపికలో నెలకొన్న ఉత్కంఠతకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తెరదించారు. శుక్రవారం విడుదల చేసిన నాలుగో జాబితాలో బీ.వీరభద్రగౌడు పేరును ప్రకటించారు. ఆయన ఎంపిక పట్ల ఆయన వర్గీయులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఆలూరు టీడీపీ టికెట్ కోసం ప్రస్తుత ఇన్‌చార్జి కోట్ల సుజాతమ్మ, టీడీపీ మాజీ ఇన్‌చార్జిలు వైకుంఠం మల్లికార్జున, వైకుంఠం ప్రసాద్ సతీమణి పారిశ్రామికవేత్త వైకుంఠం జ్యోతితోపాటు వీరభద్రగౌడు చివరి వరకు ప్రయత్నించారు. జిల్లాలో చోటు చేసుకున్న రాజకీయ సామాజిక సమీకరణల దృష్ట్యా డోన్ టీడీపీ అభ్యర్థిగా మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని ఎంపిక చేయడంతో తప్పని రాజకీయ పరిస్థితుల వల్ల సుజాతమ్మ టికెట్ వదులుకోవల్సి వచ్చింది. అదే క్రమంలో ఇటీవల పార్టీలో చేరిన మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం కూడా ఆలూరు టికెట్ ఆశించారు. ఈ పరిస్థితుల్లో నియోజకవర్గంలో సామాజికవర్గాలను పరిశీలించి రాష్ట్రంలో వీరశైవలింగాయత్‌కు కూడా అవకాశం ఇవ్వాలనే పార్టీ నిర్ణయం మేరకు వీరభద్రగౌడుకు టికెట్ దక్కింది. 2014లో ఆలూరు నుంచి పోటీ చేసిన వీరభద్రగౌడు అత్యల్పంగా 1850 ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 2019లో టీడీపీలో చేరిన కోట్ల సుజాతమ్మకు అవకాశం ఇవ్వడంతో వీరభద్రగౌడుకు టికెట్ చేజారింది. ఈ సారి మూడు దఫాలుగా టీడీపీ అభ్యర్థులను ప్రకటించినా ఆలూరు అభ్యర్థిని ప్రకటించకపోవడంతో ఉత్కంఠత నెలకొంది. పొత్తులో భాగంగా ఆదోని బీజేపికి కేటాయించడం, అక్కడ వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన డా.పీవీ పార్థసారథికి టికెట్ ఇవ్వడంతో కమ్మ సామాజికవర్గానికి చెందిన వైకుంఠం కుటుంబంలో ఒకరికి అవకాశం ఇవ్వవచ్చని రాజకీయ విశ్లేషకులు భావించారు. అయితే.. సామాజిక సమీకరణల దృష్ట్యా టీడీపీ అధినేత చంద్రబాబు వీరభద్రగౌడు వైపే మొగ్గు చూపారు. తనపై నమ్మకంతో చంద్రబాబు మరోసారి అవకాశం ఇచ్చారని, నియోజకవర్గంలో కోట్ల, వైకుంఠం, గుమ్మనూరు వర్గాలను కలుపుకుని సమన్వయంతో ముందుకు సాగుతానని వీరభద్రగౌడు తెలిపారు.

ఆలూరు టీడీపీ అభ్యర్థి వీరభద్ర గౌడ్ బయోడేటా

నియోజకవర్గం	: ఆలూరు
పేరు	: బీ వీరభద్ర గౌడ్
వయస్సు	: 56 సంవత్సరాలు
తండ్రి పేరు	: బీ ముద్దు బసవన్నగౌడ్
తల్లి పేరు	: బీ సావిత్రమ్మ
స్వగ్రామం	: బీజీహళ్లి గ్రామం హొళగుంద మండలం ఆలూరు
విద్యార్హత,	: బీకాం (ఎల్ఎల్‌బీ)
వృత్తి	: పారిశ్రామికవేత్త
భార్య	: బీ పరిమళ
పిల్లలు	: ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు 1. డా. బీ ఆశాగౌడ్ 2. డా. బీ ఐశ్వర్య గౌడ్ 3. బీ గిరిమల్లేష్ గౌడ్


రాజకీయ ప్రస్థానం:
వీరభద్ర గౌడ్ తండ్రి ముద్దు బసన్నగౌడ్ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడిగా, దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. ఆయన వారసత్వాన్ని అందుకున్న ఈయన రాజకీయాల్లోకి వచ్చారు. 2014లో ఆలూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి 1836 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. అనంతరం ఆలూరు టీడీపీ ఇన్‌చార్జిగా 2014 నుంచి 2019 వరకు కొనసాగారు.

మంత్రాలయంలో ఏపీ హైకోర్టు జడ్జి

మంత్రాలయం, మార్చి 29: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఏపీ హైకోర్టు జడ్జి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు శుక్రవారం రాత్రి మంత్రాలయం వచ్చారు. ఈయనకు పద్మనాభ తీర్థ ఏసీ గెస్ట్‌హౌస్ వద్ద ఎమ్మిగనూరు న్యాయాధికారి గురు అరవిందు, మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. శుక్రవారం మంత్రాలయం లోనే బస చేసి శనివారం గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనంకు విశేష పూజలు చేయనున్నారు.

కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లల మృతి

చాగలమర్రి, మార్చి 29: మండలంలోని గొడిగనూరు గ్రామంలో కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు శుక్రవారం మృతి చెందాయి. గ్రామానికి చెందిన పి.వీరభద్రుడు పెంచుకుంటున్న 15 గొర్రె పిల్లలు కుక్కల దాడికి మృతి చెందాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. కల్లం దొడ్డిలో పెంచుకుంటున్న గొర్రె పిల్లలు కుక్కల దాడిలో మృతి చెందాయని, రూ.60 వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. తనను ఆదుకోవాలని కోరారు.



డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

చంద్రబాబు సభ విజయవంతం

కోవెలకుంట్ల, మార్చి 29: బనగానపల్లె పట్టణంలో చంద్రబాబు నిర్వహించిన సభ విజయవంతమైంది. శుక్రవారం బనగానపల్లె పట్టణంలోని పెట్రోల్ బంకు కూడలిలో నిర్వహించిన ప్రజాగళం సభకు బనగానపల్లె నియోజ కర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాల్లోని అన్ని గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు.

చంద్రబాబుకు ఘన స్వాగతం: పట్టణంలోని ప్రజాగళం సభకు విచ్చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు బనగానపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, ధర్మవరం సుబ్బారెడ్డి శుక్రవారం ఘనస్వాగతం పలికారు. కదిరి నుంచి హెలికాప్టర్‌లో బయలు దేరిన చంద్రబాబు కర్నూలు రహదారిలోని కాట్రెడ్డి హెలిప్యాడ్ వద్దకు 11.40 గంటలకు చేరుకున్నారు. ఆయనకు బీసీ, బైరెడ్డి, శబరి తదితరుల పూలబొకేలు ఇచ్చి స్వాగతం పలికారు. పెట్రోల్‌బంకు కూడలిలో 42వ టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీడీపీ జెండాను బీసీ జనార్దన్‌రెడ్డితో కలసి చంద్రబాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన పెండేకంటి కిరణ్: కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెండేకంటి కిరణ్‌కుమార్ శుక్రవారం బనగానపల్లె పట్టణంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో చంద్రబాబు ఆయనకు టీడీపీ కండువా కప్పిన పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ విధానాలు నచ్చక ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌గౌడ్, బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, నంద్యాల విభాగం వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య పాల్గొన్నారు.

చెరుకుచెర్ల రఘురామయ్య టీడీపీలో చేరిక

బనగానపల్లె: వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య, ఆయన సతీమణి రామతులశమ్మలు శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. బనగానపల్లె పట్టణానికి ప్రజాగళం సభకు విచ్చేసిన నారా చంద్రబాబునాయుడు సమక్షంలో రఘురామయ్య, ఆయన సతీమణి రామతులశమ్మలు బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్‌ల సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి చంద్రబాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు నంద్యాల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సగినేల వెంకటరమణ, చందమాల, సింగిల్ విండో మాజీ చైర్మన్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన ధర్మవరం సుబ్బారెడ్డి

డోన్: బనగానపల్లెలో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన చంద్రబాబు ప్రజాగళం సభకు శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డితోపాటు బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రజావైద్యశాల మల్లికార్జున, అభిరెడ్డిపల్లె గోవిందు, కొచ్చెర్వు రామాంజనేయులు తదితరులు తరలి వెళ్లారు. ప్రజాగళం సభకు హాజరవుతున్న చంద్రబాబును సుబ్బారెడ్డి కలిసి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాగళం సభకు తరలిన టీడీపీ నాయకులు

కొలిమిగుండ్ల: బనగానపల్లెలో జరిగిన ప్రజాగళం సభకు కొలిమిగుండ్ల మండలం టీడీపీ నాయకులు కార్యకర్తలు శుక్రవారం తరలివెళ్ళారు. మండల టీడీపీ అధ్యక్షుడు మూలేరామేశ్వర రెడ్డి, రాష్ట్రకార్యదర్శి నంద్యాల రామేశ్వర రెడ్డి, కోకన్వీనర్ లక్ష్మీరెడ్డి, కొలిమిగుండ్ల బూత్ ఇన్‌చార్జి టైలర్ వెంకట్రాముడు, ఓబులేసు , బొట్టుస్వామి, నాగేశ్వర రెడి, మండల తెలుగు యువత అధ్యక్షుడు ఉశేనిరెడ్డి, కార్యదర్శి నంద్యాల ప్రసాద్, చింతలాయపల్లె జయలక్ష్మిరెడ్డి బస్సుల్లో తరలివెళ్ళినట్లు మండల టీడీపీ ప్రచార కార్యదర్శి కోటపాడు శివరామిరెడ్డి తెలిపారు.

అవుకు: బనగానపల్లె పట్టణంలో చంద్రబాబు నిర్వహించిన ప్రజాగళం సభ విజయంతం అయినట్లు టీడీపీ నాయకులు ఐవీ ఫక్కీర్‌రెడ్డి, ఎస్.రామకృష్ణారెడ్డి, గుండాల ప్రతాప్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, మొట్ల రామిరెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం బనగానపల్లె, కోవెలకుంట్ల నుంచి టీడీపీ నాయకులు వేలాది మంది టీడీపీ నాయకులు ప్రజాగళం సభకు తరలివెళ్లారు.

బనగానపల్లె: బనగానపల్లె మండలం నుంచి బీసీ జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన చంద్రబాబు ప్రజాగళం సభకు భారీగా తరలివచ్చారు. మండలంలోని పలుకూరు, నందవరం, యనకండ్ల, టంగుటూరు, యాగంటిపల్లె, క్రైప, ఎర్రగుడి, పాతపాడు, మీరాపురం, మంగంపేట తండా, పసుపుల తదితర గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజా గళం సభకు తరలివచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, చల్లామద్దిలేటి, గుండం మల్లిఖార్జునరెడ్డి, పీవీ.కుమార్‌రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, వెంకటసుబ్బయ్య, మద్దిలేటి, చెర్వుపల్లె మాజీ సర్పంచ్ మద్దిలేటి, మౌళీశ్వర్‌రెడ్డి, గడ్డం నాగేశ్వర్ రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, నారాయణరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, తిరుమలయ్య, బాలనాయుడు, షేక్షావలి శ్రీనివాసులు, బూషన్న, కృష్ణానాయక్, జహంగీర్, రామిరెడ్డి, సర్పంచ్ తులసిరెడ్డి తరలి వచ్చారు. చంద్రబాబు రాక కోసం మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, టంగుటూరు శ్రీనయ్య తదితర నాయకులు వేచి ఉండి ఆయనకు స్వాగతం పలికారు.




అవుకు, యాగంటిపల్లె నుంచి ప్రజాగళం సభకు బయలు దేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు



చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెండేకంటి కిరణ్‌కుమార్



టీడీపీలో చేరుతున్న వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య, రామతులశమ్మ



చంద్రబాబుకు అభివాదం చేస్తున్న ధర్మవరం సుబ్బారెడ్డి



చంద్రబాబు కోసం వేచి ఉన్న టీడీపీ నాయకులు, మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, తదితరులు

గంజాయి, కల్తీ మద్యం అమ్మడం అభివృద్ధా?



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కోట్ల సుజాతమ్మ

డోన్, మార్చి 29: గంజాయి, కల్తీ మద్యం అమ్మకాలకు డోన్‌ను అడ్డాగా మార్చిన మంత్రి బుగ్గన దృష్టిలో అభివృద్ధి అంటే ఇదేనా అని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 27వ వార్డులో టీడీపీ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించాలని ఆమె ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూ డోన్‌లో విచ్చలవిడిగా కల్తీ మద్యం అమ్ముతూ యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి బుగ్గన చెబుతున్న ఆదర్శ నియోజకవర్గం ఇదేనా అని ప్రశ్నించారు. మెయిన్ రోడ్లకు రంగులు వేసి ఏదో గొప్పలు చెప్పుకోవడం కాదని పల్లెలు, పట్టణాల్లోని వీధుల్లోకి వచ్చి చూస్తే మంత్రికి ఎలాంటి అభివృద్ధి లేదని ప్రజల సమస్యలు ఏమిటో తెలుస్తాయన్నారు. టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, బైసాని రాజు, పాల్‌రాజు, పుల్లయ్యగౌడు, రంగయ్యగౌడు, ఖాజా, జయరాముడు, బీజేపీ నాయకులు హేమసుందర్ రెడ్డి, ఆర్మీ రామయ్య పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

బేతంచెర్ల, మార్చి 29: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని డోన్ టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు యువ నాయకురాలు కోట్ల చిత్రమ్మ, మండల టీడీపీ కన్వీనర్ ఎల్లనాగయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని హెచ్. కొట్టాల గ్రామంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు రఘు, యోగేంద్ర బాబు, జనసేన నాయకులు చల్లా మద్దిలేటి స్వామి, నాగరాజు, శ్రీకంటి మధు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీమాత పల్లకి సేవ

బనగానపల్లె, మార్చి 29: మండలంలోని నందవరం చౌడేశ్వరీ మాత ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో రామానుజన్, పూజారుల ఆధ్వర్యంలో అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. పల్లకిసేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

జనసేన అధినేత గెలవాలని ప్రార్థనలు

నంద్యాల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి గెలవాలని కోరుతూ ఆళ్లగడ్డ జనసేన పార్టీ ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి ఆధ్వర్యంలో జనసేన సైనికులు శుక్రవారం సర్వమత ప్రార్థనలు చేశారు. అలాగే ఎన్నికల్లో వారాహి యాత్ర విజయవంతం కావాలని కోరుకున్నారు. కార్యక్రమంలో రాయలసీమ జోన్-2 ఎన్నికల కమిటీ సభ్యులు మహబూబ్ హుసేన్, నాగేంద్ర, రాజారాం, రత్నమయ్య, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

చాగలమర్రి, మార్చి 29: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా 40వ జాతీయ రహదారిపై టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ రమణయ్య ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర బలగాల పోలీసులతో ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ మద్యం, నగదు అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు.

నేడు టీడీపీ ఆత్మీయ సమావేశం

డోన్, మార్చి 29: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ ఎదురుగా ఉన్న పాత టీడీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు శుక్రవారం తెలిపాయి. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఆత్మీయ సమావేశానికి టీడీపీ కూటమి డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పార్టీ వర్గాలు తెలిపాయి.

గడ్డివాములు దగ్ధం

డోన్(రూరల్), మార్చి 29: డోన్ మండలం యు.కొత్తపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు రెండు గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన కె.రామాంజనేయులు రెండు ట్రాక్టర్ల ఎండు గడ్డివా ముసు నిల్వ ఉంచి పెట్టగా.. ప్రమాదవశాత్తు గడ్డివాములకు నిప్పం టుకోవడంతో డోన్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ అధికారి రంగస్వామి గౌడు ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. బాధితునికి రూ.40వేల నష్టం జరిగిందని ఫైర్ సిబ్బంది తెలిపారు.

విద్యార్థి బస్సులను సక్రమంగా నడపాలి

డోన్(రూరల్), మార్చి 29: విద్యార్థి బస్సులను ఆర్టీసీ అధికారులు సక్రమంగా నడపాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం విద్యార్థి బస్సులను అర్థాంతరంగా రద్దు చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారని అన్నారు.

నేడు పీవోలకు శిక్షణ

నంద్యాల, మార్చి 29(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పీవో, ఏపీవోలకు కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీవో మల్లికార్జునరెడ్డి శనివారం శిక్షణ ఇవ్వనున్నారని ఆళ్లగడ్డ తహసీల్దార్ నజీర్ అహమ్మద్ శుక్రవారం చెప్పారు. ఆళ్లగడ్డ పట్టణంలోని పడకండ్ల బ్రిడ్జి వద్ద ఉన్న శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో ఈ శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమానికి పీవో, ఏపీవోలు తప్పకుండా హాజరు కావాలన్నారు.

సీఎం జగన్ సమావేశంలో వలంటీరు

నంద్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): శిరివెళ్ల మండలం ఎర్రగుంట్ల గ్రామంలో సీఎం జగన్ గురువారం నిర్వహించిన రైతుల ముఖాముఖి కార్యక్రమంలో ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు గ్రామ వలంటీరు దాది రమేష్ పాల్గొన్నారని ఆళ్లగడ్డ టీడీపీ నాయకులు ఆర్వో మల్లికార్జునరెడ్డికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. వలంటీరుపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



జగన్ సమావేశంలో పాల్గొన్న వలంటీరు రమేష్

‘టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి’



ఓజీ తండాలో ప్రచారం చేస్తున్న భూమా జగత్ విఖ్యాతరెడ్డి

చాగలమర్రి, మార్చి 29: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆళ్లగడ్డ టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని ఓజీ తాండ, చెంచుగూడెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమన్నారు. వైసీపీ అరాచక పాలనకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నరసింహారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, రమణారెడ్డి, శేఖర్‌రెడ్డి, గోపాల్, ఈశ్వర్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పది మూల్యాంకనం

రెమ్యునరేషన్ చెల్లించాలి: ఎస్టీయూ



డీఈవోకు వినతి పత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

బేతంచెర్ల, మార్చి 29: పదో తరగతి పబ్లిక్ పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్లకు రెమ్యూనరేషన్ చెల్లించాలని ఎస్టీయూ జిల్లా నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి పత్రం శుక్రవారం అందజేశారు. ఎస్టీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.మౌలాలి, ఎం.ఆజాంబేగ్‌లు డీఈవోకు కలిసి 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించిన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లకు అధికారులకు ఇన్విజిలేటర్లకు చెల్లించాల్సిన రెమ్యునరేషన్ విధులు పూర్తయినప్పటికీ చెల్లించలేదన్నారు. అంతేగాక గత సంవత్సరంలో కూడా అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు కూడా చెల్లించలేదన్నారు. ఈ విషయం రాష్ట్ర స్థాయి అధికారులకు తెలియజేసి రెమ్యునరేషన్ చెల్లించాలని కోరుతూ సంఘం తరపున వినతి పత్రం అందజేసినట్లు ఆజాంబేగ్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ఉన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

డోన్, మార్చి 29: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం డోన్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ కూటమి డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి, కూతురు కోట్ల నివేతలు ముందుగా టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విదంగా కార్యాలయ ఆవరణలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోట్ల రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు దివంగత ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. తెలుగుజాతి కీర్తిని ఎన్టీఆర్ ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, మాజీ సర్పంచ్ టీఈ కేశవయ్యగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, దేవరబండ వెంకటనారాయణ, చిట్యాల మద్దయ్య గౌడు, చంద్రపల్లి ఆచారి, ఎస్ఎండీ రఫీ, ఎల్లగౌడు, భూమా నాగన్న, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, జనసేన నాయకులు బ్రహ్మం పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణ శివారులోని నంద్యాల రహదారిలో ఉన్న బేతంచెర్లలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్న లక్ష్మి, మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య అధ్యక్షతన టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో టీడీపీ జెండాను ఎగురవేసి టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్యాపిలి: టీడీపీతోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు లక్ష్మసాగరం లక్ష్మీరెడ్డి, కోట్ల శ్రీనాథ్‌రెడ్డి, టి శ్రీనివాసులు, రామ్మోహన్‌యాదవ్, రాజానారాయణమూర్తి, బత్తుల రమేష్‌రెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, నాగేంద్ర, మధుకుమార్, రాజారవి, బాలరంగన్న, కోదండరాము, గోపాల్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉయ్యాలవాడలో నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టుకున్నారు. నాయకులు బోరెడ్డి శేఖర్‌రెడ్డి, కూడాల నారాయణరెడ్డి, బోరెడ్డి నర్శిరెడ్డి, కన్నాటి మహేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య, వెంటస్వామి, కుప్పరవీధి వెంకటేశ్వర్లు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



డోన్‌లో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి, కోట్ల నివేదిత

ఘనంగా గుడ్ ఫ్రైడే

నంద్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ ప్రాంతంలోని క్రైస్తవులు ఘనంగా గుడ్‌ఫ్రైడేను జరుపుకున్నారు. క్రైస్తవులు ఉదయాన్నే చర్చిలకు వెళ్లి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు జరిపి, ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

శిరివెళ్ల: మండలంలోని యర్రగుంట్ల, శిరివెళ్ల, గోవిందపల్లె తదితర గ్రామాల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా శిలువ యాత్ర చేపట్టారు. యర్రగుంట్ల ఎస్సీ కాలనీలోని ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ ఆధ్వర్యంలో ఏసుక్రీస్తును స్తుతిస్తూ శిలువ యాత్ర సాగించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం ఉయ్యాలవాడ, రూపనగుడి, కొండుపల్లె, ఆర్.పాంపల్లె, హరివరం, అల్లూరు, మాయలూరు, పుచ్చకాయపల్లె, కాకరవాడ, పెద్దయ్మనూరు తదితర గ్రామాల్లో వేడులకలు నిర్వహించారు.

రుద్రవరం: మండలంలోని నరసాపురం, పెద్దకంబలూరు, రుద్రవరం, ఆలమూరు, చందలూరు, మందలూరు, కోటకొండ గ్రామాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు క్రైస్తవులు చేశారు. చర్చిల్లో ఫాదర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు.

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు, పెద్దబోదనం, మద్దూరు, పెద్దవంగలి, గొడిగనూరు గ్రామాల్లో గుడ్‌ఫ్రైడేను నిర్వహిచారు. చాగలమర్రి గ్రామంలోని ఆర్సీఎం చర్చి ఫాదర్, కొత్త ఎస్సీ కాలనీలో శిలువ యాత్ర ప్రారంభించారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని చర్చిల్లో మహిళలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రుద్రవరం: మండలంలోని నరసాపురం, పెద్దకంబలూరు, రుద్రవరం, ఆలమూరు, చందలూరు, మందలూరు, కోటకొండ గ్రామాల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు క్రైస్తవులు చేశారు. చర్చిల్లో ఫాదర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

డోన్(రూరల్): పట్టణంలో గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు యేసుక్రీస్తు సందేశాలను విని పించారు. అలాగే మండలంలోని చిన్నమల్కాపురం, గుమ్మకొండ, వెంకటాపురం తదితర గ్రామా ల్లోని చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు జరిగాయి.

బనగానపల్లె: బనగానపల్లె పట్టణంలోని సీఎస్ఐ చర్చి, మదర్‌థెరిస్సా ఆర్‌సీఎం చర్చి ఫాస్టర్‌ల ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని విద్యుత్ కార్యాల యం సమీపంలోన మదర్ థెరిసా ఆర్‌సీఎం చర్చి నుంచి శిలువయాత్ర నిర్వహించారు. ఫాస్టర్, సంఘ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గుడ్‌ఫ్రైడే శుభాకాంక్షలు: బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి దంపతులు, సోదరులు బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథరెడ్డిలు క్రైస్తవులకు గుడ్‌ఫ్రైడే శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి ఒక్క క్రైస్తవుడు క్రీస్తు బోధనలను ఆచరించాలని కోరారు.



యర్రగుంట్లలో శిలువ యాత్ర చేస్తున్న విశ్వాసులు



ఉయ్యాలవాడలో క్రైస్తవులనుద్దేశించి ప్రసంగిస్తున్న పాస్టర్



రుద్రవరంలో..

కొలిమిగుండ్ల: గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకొని కొలిమిగుండ్ల, బెలుం, అంకిరెడ్డిపల్లె, తుమ్మలపెంట, అబ్దుల్లాపురం, నందిపాడు, తిమ్మ నాయునిపేట, ఎర్రగుడి, కల్వటాల గ్రామాల చర్చిలలో ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ శ్రీదేవి, ఏసుక్రీస్తు శిలువ శ్రమల గురించి ప్రసంగించారు.

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్ళదుర్తి, భీమునిపాడు, రేవనూరు, కలుగొట్ల, జోల దొరాసి, చిన్న కొప్పెర్ల, వెలగటూరు, పెద్దకొప్పెర్ల గ్రామాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. కోవెలకుంట్ల పట్టణంలో పాస్టర్ల ఆధ్వర్యంలో క్రైస్తవులు శిలువ యాత్ర నిర్వహించారు. అనంతరం పాస్టర్ లూర్దు యేసయ్య అని సందేశాన్ని ఇచ్చారు.

సంజామల: మండలంలోని పేరుసోముల, గిద్దలూరు, కానాల, ఆల్వకొండ, ఆకుమల్ల, ముక్కమల్ల, సంజామల, నొస్సం గ్రామాలలో గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. నొస్సంలో పాస్టర్ విక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఆయా గ్రామాలలోని చర్చిల్లో పాస్టర్లు శుభ శుక్రవారం సందర్భంగా యేసు పలికిన ఏడు మాటల గురించి క్రైస్తవులకు బోధించారు.

యువతకు 20 లక్షల ఉద్యోగాలు: కోట్ల నివేదిత

డోన్, మార్చి 29: టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్రంలోని యువతకు ఉజ్వల భవిష్యత్తును కల్పించేందుకు 20లక్షల ఉద్యోగాలు ఇస్తారని, టీడీపీ కూటమి డోన్ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల నివేదిత అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ కాలనీ ప్రాంతంలో టీడీపీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

● **అన్నివర్గాలకు టీడీపీతోనే న్యాయం:** టీడీపీ అధినేత చంద్రబాబుతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, డోన్ మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలో టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవరబండ వెంకట నారాయణ, మిద్దెపల్లి గోవిందు, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, రామదుర్గం సుబ్బరాయుడు, గోవిందరెడ్డి, వెంకటాపురం రామిరెడ్డి, పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

మాజీ మంత్రి భూమా అఖిలప్రియ



యర్రగుంట్లలో టీడీపీలో చేరిన నాయకులతో అఖిలప్రియ

శిరివెళ్ల, మార్చి 29: రాష్ట్రంలో వైసీపీ పాలనలో విసిగిపోయిన ప్రజలు మార్పును కోరుకుంటున్నారని టీడీపీ మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని యర్రగుంట్ల గ్రామానికి చెందిన వంద కుటుంబాలు వైసీపీని వీడి శుక్రవారం టీడీపీలో చేరాయి. మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, భార్గవ్‌రామ్ నాయుడులు వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం అఖిలప్రియ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక నిజాయితీగా పని చేసే వలంటీర్లకు సముచితం స్థానం ఉంటుందన్నారు. టీడీపీనాయకులు కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మురళి, కమతం లక్ష్మిరెడ్డి, పుల్లారెడ్డి, జయరామిరెడ్డి, సత్తారు లక్ష్మిరెడ్డి, శీలం లక్ష్మీప్రసాద్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు అంతం తప్పదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. శుక్రవారం చాగలమర్రి న్యూబిల్డింగ్ కాలనీ, భవాని నగర్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్-6 పథకాల గురించి తెలియజేస్తూ టీడీపీకి ఓటు వేయాలని కోరారు. అనంతరం టీడీపీ నాయకులు అన్సర్‌బాషా, జెట్టి నాగరాజు అఖిలప్రియ సమక్షంలో ఆధ్వర్యంలో 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి కండువాలు కప్పి ఆమె పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. నరసింహారెడ్డి, సల్లా నాగరాజు, గుత్తి నరసింహులు, ఉసేన్‌వలి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.